
ప్రజాశక్తి
బుధవారం 08 అక్టోబర్ 2025 5
అనంతపురం



మహనీయులు మహర్షి వాల్మీకి

జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు



అనంతపురంలో వాల్మీకికి నివాళి అర్పిస్తున్న మంత్రి కేశవ్, తదితరులు

మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహనీయులు మహర్షి వాల్మీకి అని పలువురు కొనియాడారు. వాల్మీకి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. అనంతపురంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాల్మీకి సర్కిల్లో ఉన్న వాల్మీకి విగ్రహానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మానవుడు మారగలడు అనేదానికి వాల్మీకి మహర్షిని మించిన ఉదాహరణ మానవజాతి చరిత్రలో ఎక్కడ వెదికినా కనిపించదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

ద(గు)బుల్ రిజిస్ట్రేషన్..!

- వెలుగులోకి మరో భూ మాయ
- డబుల్ రిజిస్ట్రేషన్‌తో భూమి కాజేసే కుట్ర
- రెవెన్యూ విచారణలోనూ తేలిన అక్రమాలు



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఇప్పుడు ఎక్కడ భూమి కనబడినా యజమానికి తెలియకుండానే చేతులు మారిపోతోంది. రిజిస్ట్రేషన్ స్థలాలనే ఇతరులకు డబుల్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అనంతరం కొంత మంది వ్యక్తులు వచ్చి తమదే భూములని చెబుతుండటం పరిపాటిగా మారుతోంది. ఇటీవలనే అనంతపురం నగరంలోని సాయినగర్‌లో ఇటువంటి ఘటనే జరిగిన విషయం తెలిసిందే. తాజాగా అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఇటువంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. ఎప్పుడో 16 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమిని 2025 జులైలో మరోకరు చేయించుకోవడం జరిగింది. అనంతరం ఆ స్థలంలో భూమి తమదంటూ బోర్డు కూడా పెట్టడంతో స్థల యజమానులు లబోదిబో మంటున్నారు. అధికారులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు తమకు జరిగిన నష్టాన్ని తెలియజేశారు. వారి దీనిని విచారించాలని ఆదేశాలు ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు స్థలంలో సర్వేలు చేపట్టారు. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగానున్నాయి.

అనంతపురం నగరంలోని ఎ.నారాయణపురం రెవెన్యూ పరిధిలోని 156 సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల పొలముంది. దీన్ని నారప్ప సబ్ డివిజన్ తరువాత వేరొకరికి అమ్మారు. నగేష్, కేశవయ్యల ద్వారా కవలూరు కృష్ణ అనే వ్యక్తి 2009లో ఒక ఎకరం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వారి ఆధీనంలోనే ఉంది. ఈ భూమిని 2009 జులై 25వ తేదీన ముకుందనాయుడు, పద్మగీత పేరు మీద జులై 25వ తేదీన మరో రిజిస్ట్రేషన్ అయ్యింది. రమణారావు అనే సబ్ రిజిస్ట్రార్ ఈ భూమిని మొదట పెండింగ్ పెట్టి తరువాత ఆగస్టు 6వ తేదీన రెగ్యులర్ చేసినట్టు ఆరోపణలున్నాయి.

మాకు న్యాయం చేయండి
అనసూయ, కవలూరు కృష్ణ.

2009లో మేము కొన్న భూమిలో ముకుందనాయుడు అనే వ్యక్తి ఆగస్టు 14వ తేదీన ఈ స్థలం తనదేనంటూ బోర్డు నాటారు. దీనిపై ఆగస్టు 18వ తేదీన కలెక్టరుతోపాటు, రిజిస్ట్రేషన్ అధికారులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఆ సర్వే రిపోర్టు అందజేసి, డబుల్ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని తాము అధికారులను వేడుకుంటున్నాం. 38 సంవత్సరాలు కష్టార్జితం ఆ భూమి అని, దానిని తమకు ఇచ్చి న్యాయం చేయాలి.

సర్వేలో కవలూరి కృష్ణదిగానే తేలింది
హరికుమార్, తహశీల్దార్, అనంతపురం అర్బన్.

ఎ.నారాయణపురంలోని 156 సర్వే నంబర్‌లో సర్వే నిర్వహించాం. మొత్తం తొమ్మిది ఎకరాలుంటే.. అందులోనున్న వారందరినీ పిలిచి సర్వే చేశాం. వెబ్ ల్యాండ్ ప్రకారం ఆ భూమి కవలూరిది కృష్ణదిగానే తమ రికార్డుల్లో ఉంది. ఈ నివేదికను సబ్ రిజిస్ట్రేషన్ శాఖకు ఎండార్స్ చేస్తాం. డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిఉంటే తదుపరి చర్యలు ఆ శాఖ అధికారులు తీసుకోవాల్సి ఉంటుంది.

13, 14, 15 తేదీల్లో

అనంతలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

9 నుంచి 12 వరకు ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కళా ప్రదర్శనలు



ఐద్వా మహాసభల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలోని ఎంకెఎం ఫంక్షన్ హాల్లో ఐద్వా రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, రాష్ట్ర నాయకురాలు డా॥ప్రసూన తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా 4 రోజుల పాటు నిర్వహిస్తున్న చైతన్య కళా సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్లను మంగళవారం స్నేహలత నర్సింగ్ హోంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా॥అరుణ, ప్రిన్సిపల్ ప్రగతి, డా॥ప్రసూన చేతుల మీదుగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కృష్ణ కళామందిరిలో మహిళల సమస్యలపై వివిధ రూపాల్లో ఉన్న ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌కు పిల్లలు, పెద్దలు, కవులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాలు రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేశవ్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-ఉరవకొండ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కేశవ్

పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేకంగా 'ప్రజాదర్బార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి తరలివచ్చిన ప్రజలు, నాయకుల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని వెన్నపూసపల్లి, 85 నిట్టూరు గ్రామాల్లో ఎహెచ్‌ఎలు చేస్తున్న ఈ క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని ఎడిఎ రవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన క్రాప్ బుకింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రబీ ప్రారంభం దశ వస్తున్నా క్రాప్ బుకింగ్ ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీ లోపు పంట నమోదు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, ఏఈవో మధు కుమార్ పాల్గొన్నారు.

గొర్రెలు, పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గొర్రెలు, మేకలు, పెరటి కోళ్ల పెంపకంపై రైతులకు మండలంలోని రెడ్డిపల్లి దగ్గర ఉన్న శిక్షణ కార్యాలయం శిక్షణ నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సంయుక్త సంచాలకులు డా॥ప్రేమ్‌చంద్ గొర్రెలు, మేకలు, పెరటి కోళ్ల పెంపకంలో ఆధునిక యాజమాన్య పద్ధతులపై అధికారులు తెలియజేశారు. గొర్రెలు, మేకలు, పెరటి కోళ్లను పెంచి ఆదాయం పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఏహెచ్ అధికారి ఎన్.అశ్వర్థప్ప, శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డా॥రామచంద్ర రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డా॥వై.రమేష్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు డా॥రత్నకుమార్, డా॥సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుత్తిలో ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాల్టీ పరిధిలోని కోటవీధిలో ఉన్న సచివాలయం-6లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కరెక్షన్, కొత్త ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రజలందరూ ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, వీఆర్వో నాగరాజు, సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో మంగళవారం జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీల్లో విజేతలకు టిడిపి గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ బహుమతులను అందజేశారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గ్రామంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో ప్యాపిలి జట్టు కదిరిపల్లి జట్టు తలపడ్డాయి. తుది పోరులో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గుమ్మనూరు ఈశ్వర్ సొంత నిధులు రూ.25 వేలుతోపాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్స్‌కు రూ.15 వేలు, మూడవ బహుమతి గుంటూరు జట్టుకు రూ.8వేలు, నాలుగవ బహుమతి వన్నెదొడ్డి జట్టుకు రూ.4వేలు ఇచ్చారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన కబడ్డీలో క్రీడాకారులు నైపుణ్యాన్ని సాధించి భారతదేశం తరపున ఆడి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, గుత్తి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్, సర్పంచి యు.రామలింగమయ్య, టిడిపి నాయకులు ఆర్ఎస్.రాజా, చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామి రెడ్డి యాదవ్,లక్ష్మీ రంగయ్య, ఓం ప్రకాష్, డేగ మద్దిలేటి, న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

ఈ సారైనా హెచ్‌ఎల్‌సికి సాగునీరిస్తారా.?

ప్రజాశక్తి-పుట్లూరు



చుక్కనీరు లేని పుట్లూరు చెరువు

జిల్లాలో ఉన్న చెరువులన్నింటినీ నీటితో నింపుతామని ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో పాలకులు చెబుతున్నారు. అయితే సాగునీరు ఇస్తామని ఎక్కడా స్పష్టంగా చెప్పకపోవడంతో ఈ సారి కూడా కేవలం తాగునీటికే వదులుతారా సాగునీటికి నీరు వదలరా అని మండలంలోని రైతులు చర్చించుకుం టున్నారు. అక్టోబర్ నెల వచ్చినా మండలంలో వర్షపాతం తక్కువగా నమోదవడం వల్ల ఎక్కడా నీటి జాడలు కనపడటం లేదు. దీంతో రైతులు సాగు చేసిన అరటి, మొక్కజొన్న, దానిమ్మ, బత్తాయి పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో రైతులు 1000 నుంచి 1500 అడుగుల వరకూ బోర్లు వేయిస్తున్నా ఫలితం లేదు. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. కేవలం తాగునీటి అవసరాల దృష్ట్యా పాలకులు, అధికారులు గత 15 ఏళ్లుగా మండలంలోని సుబ్బరాయుడుసాగర్‌తో పాటు పుట్లూరు, కోమటికుంట్ల, గరుకుచింతలపల్లి చెరువులకు అరకొరకగా నీరు నింపుతున్నారు. పంటలకు సాగునీరు వదలకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. సుబ్బరాయుడు సాగర్ నుంచి పుట్లూరు, కోమటికుంట్ల చెరువులకు వెళ్లే కాలువ కింద 35 వేల ఎకరాల వరకూ సాగునీరు అందించాల్సి ఉంది. కానీ 15 ఏళ్ల నుంచి హెచ్‌ఎల్‌సి ద్వారా పంటలకు ఏమాత్రం సాగునీరు అందించడం లేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పుట్లూరు మండలంలో పంటలకు సాగునీరు అందాలంటే తుంగభద్ర డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సికి ఎక్కువగా నీరు వదలాలి. అయితే ఆ స్థాయిలో నీరు సరిగా రాకపోవడంతో కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పుట్లూరు చెరువుతో పాటు సుబ్బరాయుడు సాగర్‌ను నింపాలని చాలా ఏళ్లుగా మండల ప్రజలు పాలకులను కోరుతున్నారు. ఈ ఏడాదైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఈ వర్షాకాల సమావేశాల్లో శాసనమండలి, శాసనసభలో ఎత్తిపోతల పథకం ద్వారా పుట్లూ రు చెరువు, సుబ్బరాయుడు సాగర్‌ను నింపి పుట్లూరు, ఎల్లనూరు మండలాల రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే శాసన మండలిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డిగారి రామ గోపాల్‌రెడ్డి, శాసనసభలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లో నీటి సమస్యను వివరించారు. ఈ ఏడాదైనా ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని పుట్లూరు చెరువు, సుబ్బరాయ సాగర్ డ్యాం నింపుతారని రైతులు ఆశగా ఉన్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి హెచ్‌ఎల్‌సి ద్వారా కానీ గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా కానీ మండలంలోని చెరువులతో పాటు సాగునీరు కూడా అందించి భూగర్భ జలాలు పెంచాలని మండలంలోని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు.

18న పాఠశాల స్థాయి జెవివి చెకుముకి సంబరాలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన డిఇఒ ఎం.ప్రసాద్ బాబు



పోస్టర్లను విడుదల చేస్తున్న డిఇఒ, జెవివి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలు ఈ నెల 18వ తేదీన పాఠశాల స్థాయిలో ప్రారంభమవుతున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలియజేశారు. మంగళ వారం చెకుముకి సంబరాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. 35 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థుల చేత ప్రతి సంవత్సరం ఈ సంబరాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా 18న ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రంలో దాదాపు 4.50లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 25 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ఎన్నికైన వారు మండల స్థాయికి, మండల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి కోటేశ్వరప్ప, జెవివి నగర కార్యదర్శి ఎస్.తిరుపాల్, కోశాధికారి ఎం.రామిరెడ్డి పాల్గొన్నారు.

పని గంటల పెంపు దుర్మార్గం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



నిరసన తెలుపుతున్న సిఐటియు, రైతుసంఘం, వ్యకాసం నాయకులు

పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో పనిగంటల పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులకు తక్కువ జీతాలు చెల్లించి, ఎక్కువ పని చేయించుకోవాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. కార్మిక వర్గాన్ని అణచివేయాలని, దేశ సంపదను ఆదానీ వంటి వారికి కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం గత ఏదేళ్లుగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మేసే చర్యలను వేగవంతం చేస్తోందన్నారు. అసెంబ్లీలో ఐదు గంటలు ఓపికగా కూర్చోలేని పాలకవర్గాలు సంపద సృష్టించే శ్రామిక వర్గం మాత్రం 10, 12, 13 గంటలు పని చేయాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం పని గంటలు పెంచడం దుర్మార్గం అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసహరించుకోవాలని, లేకుంటే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మన్నిల రామాంజనేయులు, నాగభూషణం, వెంకటనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆది, స్వాతి, మున్సిపల్ యూనియన్ నాయకులు ఏర్రిస్వామి, లక్ష్మీ నరసమ్మ, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, కుమార్ పాల్గొన్నారు.



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సిపిఎం, ఐలు, ఐద్వా నాయకులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి హేయం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సుప్రీంకోర్టు భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై జరిగిన దాడి హేయమయిందని న్యాయవాదులు ఖండించారు. ఐలు ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఈ.వెంకటరాముడు, స్పోర్ట్స్ సెక్రటరీ విజయభాస్కర్, ఐలు అధ్యక్ష కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్ మాట్లాడుతూ భారత అత్యున్నతమైన న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందని అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు ఉపాధ్యక్షులు మల్లేష్ గౌడ్, జిసి.ప్రకాష్, నాయకులు, పురుషోత్తం, అశోక్, గిరీష్ లక్ష్మణ్, భరత్, సీనియర్ అడ్వకేట్ నాగేంద్ర పాల్గొన్నారు.

గుంతకల్లు : సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్.గవాయ్‌పై దాడికి యత్నించిన మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశ ద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం అనుబంధ ఐలు, సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్, ఆవాజ్, పిపిఎస్, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన సిజెఐపై దాడికి వ్యతిరేకంగా మంగళవారం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర బాబు అధ్యక్షతన వారు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐలు పట్టణ కన్వీనర్ వై.శ్రీనివాసులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ చొక్కా సునీల్ కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజ్, పిపిఎస్ పట్టణ కన్వీనర్ మారుతి ప్రసాద్, కెవిపిఎస్ పట్టణ అధ్యక్షుడు రామునాయక్ మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. సనాతన ధర్మం పరిరక్షణ పేరుతో మతోన్మాద న్యాయ వాది కోర్టులోనే సిజెఐపై బూటు విసిరేందుకు యత్నించడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోంద న్నారు. దేశ అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్న దళితులకే ఈ గతి పడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు నాయకులు వైటి చెరువు రమేష్, సిఐ టియు నాయకులు బాషా, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు డేనియల్, ఈరన్న, కెవిపిఎస్ నాయకులు శంకర్, ఆవాజ్ నాయకులు షాషా, ఆటో కార్మిక సంఘం నాయకులు హరి, కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల సమస్యలను వివరించారు. ఆయా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. హంద్రీనీవా ద్వారా నీరు అందించాల్సిన ప్రాంతాలు, ఇళ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు వంటి సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. అన్ని అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ అభివద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే సునీత కలెక్టర్ కోరారు.

ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ పోటీల స్కోరర్‌గా తాడిపత్రి వాసి

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణానికి చెందిన బందెల వినయ్ వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లకు స్కోరర్‌గా ఎంపికయ్యాడు. వినయ్ స్థానిక ఆర్‌డిటి సబ్ సెంటర్‌లో క్రికెట్‌లో శిక్షణ పొందాడు. అండర్-16, 19 విభాగాల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆరేళ్ల నుంచి అంపైర్, స్కోరర్‌గా రాణిస్తున్నాడు. ప్రస్తుతం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో స్కోరర్‌గా సేవలందిస్తున్నాడు. ఐసిసి ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్-2025లో భాగంగా అక్టోబర్ 9 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నంలో పలు మ్యాచ్‌లు జరుగనున్నాయి. అందులో భాగంగా ఇంగ్లాండ్ వర్సెస్ న్యూజిలాండ్ మ్యాచ్‌కు వినయ్ స్కోరర్‌గా ఎంపికయ్యారు. వినయ్‌ను అనంతపూర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ భీమ లింగారెడ్డి, ఎసిఎ అంపైర్స్ కమిటీ సభ్యులు, అనంతపూర్ అంపైర్స్ అండ్ స్కోరర్స్ అసోసియేషన్ సెక్రటరీ అన్వర్‌ఖాన్, ఆర్‌డిటి కోచ్ యుగంధర్‌రెడ్డి, తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాధిక్‌వలి, ఆర్‌డిటి సబ్ సెంటర్ కోచ్ భార్గవ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



బందెల వినయ్

11న ఎంటిఎస్ ఉపాధ్యాయుల విజ్ఞాపన సభ

రాయదుర్గం : ఈ నెల 11వ తేదీ విజయవాడలోని ధర్నా చౌక్ లో నిర్వహించ తలపెట్టిన విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని 1998 డిఎస్సీ ఎంటిఎస్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు చెందిన ఎంటిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

రాయదుర్గం : పరిశుభ్రత అనేది ప్రతి వ్యక్తి బాధ్యత అని, పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు కూడా దరి చేరవని రాయదుర్గం వైద్యాధికారులు డా. అజారిఖాన్, డా. యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని శాంతి నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు, పాటించకపోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో మలేరియా ఆరోగ్య సహాయకులు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు సరోజ, ప్రమీల, శైలజ, సునీత, అరుణ, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెవివి 'చెకుముకి' పోస్టర్ ఆవిష్కరణ

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ పోస్టర్లను విడుదల చేశారు. హెచ్ఎం వి.వసుఖ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జెవివి సభ్యులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

బొమ్మనహాళ్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు ఆరోగ్య ఉప కేంద్రాల్లోని ఆశా వర్కర్లు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో డాక్టర్లకు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, నాణ్యత గల యూనిఫారం అందజేయాలని, రాష్ట్ర, కేంద్ర ఉద్యోగులతో సమానంగా సెలవులు ప్రకటించాలని, 5జి మొబైల్, నాణ్యత గల సిమ్‌లు మంజూరు చేయాలని, దహన సంస్కారాలకు రూ. 20వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత : ఎపిఒ

నార్పల : ఉమ్మడి ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఉపాధి హామీ ఎపిఒ రమేష్ రామారావు తెలిపారు. 'గ్రామపంచాయతీ ఉమ్మడి భూముల అభివృద్ధి అందరి బాధ్యత' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నాయనపల్లి గ్రామపంచాయతీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సార్స్ సంస్థ ఆధ్వర్యంలో మండల అధికారులు, సంస్థ సిబ్బంది ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు అమలుకు గ్రామ పెద్దలు ప్రజలు సహకరించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. గ్రామంలోని కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజీ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.క్రాంతికుమార్, వై.రంగారెడ్డి, బి.దామోదర్ పాల్గొన్నారు.

సిద్దరాచర్లలో వైద్య శిబిరం

నార్పల : మండలంలోని సిద్ధరాచెర్ల గ్రామపంచాయతీలో మంగళవారం సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. జ్వరాలు, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులని సంప్రదించాలన్నారు. సిద్ధిరాచర్ల, దుర్గం గ్రామాల్లో ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి సాకే రామాంజనేయులు, సూపర్వైజర్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, వార్డు మెంబర్ సావిత్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, ఎఎన్ఎం గౌతమి, ఆశా వీరనారాయణమ్మ పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

అనంతపురం : బుక్కరాయసముద్రం పిహెచ్‌సిని మంగళవారం డిఎంహెచ్ఒ డాక్టర్ భ్రమరాంబదేవి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మండల ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యాధికారులు వారి డిమాండ్స్ కోసం విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారని, దీంతో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయా ఆసుపత్రుల్లో వైద్యులను నియమించామన్నారు. సిబ్బంది కూడా సెలవులు తీసుకోకుండా పని చేయాలని ఆదేశించారు. ఆమె వెంట పిహెచ్‌సి సిబ్బంది మహబూబ్, శ్రీనివాసులు, నారాయణనాయక్, సూపర్వైజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

హెచ్ఐవి, టిబి, సుఖవ్యాధులపై అవగాహన

శింగనమల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారు మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు హెచ్ఐవి, టిబి, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ వెంకటపతి, ల్యాబ్ టెక్నీషియన్ గీత, ఆరోగ్యశ్రీ సిబ్బంది బాలు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ హెచ్ఐవి, టిబి, సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి సంక్రమణ, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ విజయ్ భాస్కర్, ఆశా వర్కర్స్, ప్రజలు పాల్గొన్నారు.

సామాన్యుల గొంతుక 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి-ఆత్మకూరు

సామాన్యుల గొంతుకుగా ప్రజాశక్తి దినపత్రిక పని చేస్తుందని టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కనకదాసు కళ్యాణ మండపంలో మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లా విలేకరుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ బాబు హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల టిడిపి ఇన్‌ఛార్జి బాలాజీ ఎప్పుడూ పాత్రికేయులకు అండగా ఉంటారని, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. పాత్రికేయుల సమస్యలు తెలిపితే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల సంక్షేమం కోసం తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహా, అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్, ఉమ్మడి అనంతపురం జిల్లా పాత్రికేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు

కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఎపి విడబ్ల్యుఎస్ఈ జెఎసి ఆధ్వర్యంలో నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రధానంగా సీనియార్టీ జాబితా ప్రకటించాలని, 3 నోషనల్ ఇంక్రిమెంట్స్, 9 నెలల అరియర్స్, ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రతి ఉద్యోగికి ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం(ఎఎఎస్)అమలు, సిఎల్, ఈఎల్ లీవ్స్ మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని, స్టేషనరీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయాల్లో ప్రింటర్స్ సరిగా పనిచేయడం లేదని తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు డి.సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, సిరాల చంద్ర, మల్లికార్జున, రామకృష్ణ, మల్లన్న, లక్ష్మీకాంత్, శ్రీనాథ్, నాగిరెడ్డి, రమేష్, గురుబ్రహ్మ, నరేష్, విమల, దిల్షాద్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

కమిషనర్ బాలస్వామి మంగళవారం నగరంలోని ప్రధాన సర్కిళ్లు, రహదారుల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ముందుగా విద్యుత్ నగర్ సర్కిల్‌కు వెళ్లి చెత్తకుప్పలను ఎప్పటి కప్పుడు తొలగించాలని ఆదేశించారు. కూరగాయల వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని, అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరిస్తున్న పనులను పర్యవేక్షించారు. రోజూ నిర్ణీత సమయం లోపు చెత్త సేకరణ జరిగేలా చూసుకోవాలని ఆదేశించారు. బళ్లారి రోడ్డుని అన్న క్యాంటీన్‌ను సందర్శించి, అల్పాహార నాణ్యతను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం : మంత్రి

ప్రజాశక్తి యంత్రాంగం

రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం ఉరవకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి కేశవ్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి మహర్షి వాల్మీకి గొప్పతనాన్ని కొనియాడారు. రాష్ట్రంలోని వాల్మీకి, బోయ సామాజిక వర్గాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రాయదుర్గం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి, కూరగాయల మార్కెట్, బస్టాండ్ సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతినగర్‌లోని చంద్రబాబు పార్కు చేరుకుని అక్కడ భక్త కన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి నేతలతో కలిసి కోటలో కొత్తగా నిర్మించిన వాల్మీకి కళ్యాణ మండపం వద్దకు చేరకుని ప్రారంభించారు. పెద్దవడుగూరులో ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ప్రధాన రహదారి నుంచి విగ్రహం వద్దకు ర్యాలీ చేపట్టారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి సర్కిల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్మీకి సర్కిల్‌ను సుందరంగా తయారు చేస్తున్నామని తెలిపారు.



రాయదుర్గంలో వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ



పెద్దవడుగూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి



కళ్యాణదుర్గంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

రక్తపరీక్షలు చేయాలి

యాడికి : గ్రామాల్లో జ్వర పీడితులను రక్తపరీక్ష కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు ఆశా కార్యకర్తలను ఆదేశించారు. ఎఎన్ఎంలు, సూపర్వైజర్లకు నిర్దేశించిన మేరకు రక్తపూతలు తప్పక తీయాలన్నారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం యాడికి, రాయలచెరువు పిహెచ్‌సిల్లో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. గ్రామాల్లో తప్పక ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లకు సూచనలు చేశారు. సమావేశంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, పిహెచ్‌సిల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మలదిన్నెలో గ్రామసభ

పెద్దపప్పూరు : మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. డ్రెయినేజీ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామసభలో టిడిపి మండల కన్వీనర్ లోకనాథ్‌రెడ్డి, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

గుంతకల్లు : విద్యా శాఖలో పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు దాసరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఇఒలు మస్తాన్‌రావు, సుబ్బారాయుడులకు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అతి తక్కువ వేతనం(నెలకు రూ. 6వేలు)తో ఆయాలు, నైట్ వాచ్‌మెన్లుగా పని చేస్తున్న వారికి 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించిన కనీస వేతనం రూ. 18వేలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, వాచ్‌మెన్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పామిడి : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి స్వచ్ఛ అవార్డు రావడానికి కారకులైన పారిశుధ్య కార్మికులను మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యుడు చిలకల రాజగోపాల్ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు ఆసుపత్రి వైద్యాధికారి వైద్యాధికారి శివకార్తీక్ రెడ్డి సమక్షంలో పారిశుధ్య కార్మికులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కమలాదర్, హెడ్ నర్స్ శివజ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద అన్నదానం


అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. శబరినాథ్ జయంతి సందర్భంగా సతీమణి అనిత, కుమార్తె అక్షర, కుమారుడు అద్వైత్, తల్లి ధనలక్ష్మి సహకారంతో 150 మంది పేదలకు అన్నదానం చేసినట్లు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఓబుళపతి, నబిరసూల్, చంద్రశేఖర్, రవికుమార్, రామకృష్ణ, దామోదర్, పాల్గొన్నారు.

నేడు శ్రీహరి మెడికల్ స్టోర్స్ ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సుభాష్ రోడ్డులో టవర్ క్లాక్ సమీపంలో శ్రీహరి మెడికల్స్ స్టోర్స్ 6వ బ్రాంచ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ అధినేతలు అబ్బూరి వంశీ, కొల్లు శ్రావణ్ కుమార్‌రెడ్డి, మారోతు చంద్ర, పతకమూరి నాగభూషణం తెలిపారు. నగరంలో మంగళవారం వారు మాట్లాడుతూ అనంతపురం నగరంలో ప్రజలకు ఔషధ సేవలు అందించేందుకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు 20 శాతం డిస్కౌంట్ రూపంలో ఔషధాలు అందిస్తామన్నారు. తమ షోరూంలో ఔషధాలు, సర్జికల్ ఐటమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్, గౌరవ అతిథులుగా సర్వజన ఆసుపత్రి ప్రధాన పర్యవేక్షకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబి.దేవి, ఐఎంఎ అధ్యక్షులు మురళీకృష్ణ దివ్యశ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్మోహన్, వైద్యులు హరిప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ప్రజలు శ్రీహరి మెడికల్స్ అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆలయ పాలకమండలి నియామకంపై చలనం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మలోబిల లక్ష్మీనర సింహస్వామి ఆలయ పాలక మండళ్ల నియామకంపై జిల్లా దేవాదాయ శాఖ అధికారుల్లో చలనం వచ్చింది. ఈ నెల 5వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో ఆయా ఆలయ పాలకమండళ్ల నియామకంలో అలసత్వంపై ప్రచురితమైన కథనంపై జిల్లా దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. గత ఆగస్టులో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయగా 13 దరఖాస్తులు అందాయన్నారు. వాటిని విచారణ నిమిత్తం దేవాదాయ శాఖ కార్యాల యానికి పంపామని, వారి నుంచి నివేదిక రాగానే ఆలయ పాలక మండలి నియామకానికి చర్యలు తీసు కుంటామన్నారు. అలాగే మలోబిల లక్ష్మీనర సింహస్వామి ఆలయ పాలక మండలి నియామకానికి గత మే నెలలో నోటిఫికేషన్ ఇవ్వగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని, దీంతో ఆలయ పాలక మండలిని ఏర్పాటు చేయలేకపోయామని వివరణ ఇచ్చారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు చిత్రపటానికి పాలాభిషేకం

గుంతకల్లు : నియోజకవర్గంలో కార్పొరేట్ సెలూన్ షాపులు పెట్టడానికి సహకరించబోమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హామీ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం పట్టణ నాయీబ్రాహ్మణుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపు ఏర్పాటు చేయడంతో కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణుల ఆదాయానికి గండి పడిందన్నారు. దీంతో తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నియోజకవర్గంలో భవిష్యత్తులో కార్పొరేట్ సెలూన్ షాపులను ఏర్పాటు చేసేందుకు అంగీకరించబోమని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు మాణిక్యం, ప్రమేష్‌బాబు, గోవిందరాజులు, సహాయ కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాసులు, బి.వెంకటేశ్వర్లు, జయరామ్, విద్యా కమిటీ ఛైర్మన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అలంకరాయునిపేట గ్రామాభివృద్ధిపై సమీక్ష సమావేశం

శింగనమల : మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు స్వగ్రామం మండలంలోని అలంకరాయునిపేట గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అలంకరాయునిపేటలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి, తదితర పనుల వేగవంతంపై అధికారులతో చర్చించారు. గ్రామ అభ్యున్నతికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తీసుకున్న చొరవ అభినందనీయం అని ఎమ్మెల్యే రాజు కొనియాడారు.



అనంతపురంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు, ఆటో డ్రైవర్లు

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అభినందనీయం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల అనంతపురం పార్లమెంట్ దివ్యాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు మదమంచి గంగానాయుడు పేర్కొన్నారు. గంగానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ చిత్రపటాలకు దివ్యాంగులతో కలిసి పాలాభిషేకం చేశారు. అలాగే జూనియర్ కాలేజ్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ. 15వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల రాష్ట్ర ఛైర్మన్ గడిపూటి నారాయణస్వామి, నాయకులు బ్రహ్మ, టిడిపి విభిన్న ప్రతిభావంతుల శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు నాగూర్ ఉమర్(స్టాలిన్), మాబు, కృష్ణగోపాల్, చంద్ర, శ్రీకృష్ణ,అశోక్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు

బెళుగుప్ప : కూటమి ప్రభుత్వం మండలంలో 27 మంది ఆటో డ్రైవర్లకు రూ. 15 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేయడం పట్ల స్థానిక టి సర్కిల్‌లో ఆటో యూనియన్ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు రాధాకృష్ణ, కంచరాముడు, ధనుంజయరెడ్డి, మనోహర్, ధనుంజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు శివ, ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

లారీ అదుపుతప్పి బ్రిడ్జి కల్వర్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బూదవర్తి గ్రామానికి చెందిన శంకర్‌నాథ్(40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బళ్లారికి లోడ్ ఉండడంతో లారీలో ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గమధ్యలో శ్రీరంగాపురం, బూదవర్తి గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి కల్వర్టును అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు గమనించి అతడిని బయటకు తీసి హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.



జగన్‌కు పూలబొకే ఇస్తున్న ఉమా మహేశ్వర నాయుడు

జగన్‌ను కలిసిన ఉమా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వైసిపిలో కీలకమైన సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తనను మెంబర్‌గా నియమించినందుకు కళ్యాణదుర్గం నియోజకవర్గ వైసిపి నాయకుడు మాదినేని ఉమామహేశ్వరనాయుడు మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జగన్‌కు పూలబొకే, శ్రీవారి ప్రతిమ అందజేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కళ్యాణదుర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని జగన్ ఉమామహేశ్వర నాయుడుకు సూచించినట్లు ఆయన తెలిపారు.

వికలాంగులకు అండగా ఉందాం : ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం టౌన్ : దివ్యాంగులకు అందరం అండగా ఉందామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పిలుపు నిచ్చారు. స్థానిక కరణంచిక్కప్ప ఉన్నత పాఠశాలలో మంగళవారం భవిత కేంద్రం ఏర్పాటు చేసిన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకే కాకుండా దివ్యాంగ యువతకు కూడా పరికరాలు ఇచ్చేలా చూడాలని డిఆర్‌డిఎ పిడి శైలజకు సూచించారు. మండల కేంద్రంలోనే శిబిరాలు ఏర్పాటు చేసి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. శిబిరాలకు ఆర్థికసాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపి.రమేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాడ్మింటన్ పోటీల విజేతలకు ట్రోఫీలు ప్రదానం

కళ్యాణదుర్గం రూరల్ : అనంతపురంలో నిర్వహించిన అండర్-17 బాల, బాలికల బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల విజేతలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ట్రోఫీలు అందజేశారు. అలాగే సొంతంగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు అందజేశారు.